ప్రజాశక్తి
బుధవారం 19 ఏప్రిల్ 2023 5
శ్రీ సత్యసాయి



కొండపై ఏంజరిగింది..



◆ఉమాపతిది ఆత్మహత్యా... హత్యా..? ◆ప్రమాదమని కుటుంబ సభ్యుల ఫిర్యాదు

◆పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు ◆విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి...

అనంతపురం నగరంలోని విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతిది ఆత్మహత్యనా...లేక హత్య అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. బుక్కరాయసముద్రం మండలం పరిధిలోని దేవరకొండపై కారు దూసుకెళ్లి కిందపడిన ఘటనలో ఉమాపతి మృతి చెందినట్టు వీడియో ఒకటి సోషియల్ మీడయాలో హల్‌చల్ చేస్తోంది. నగరంలోనే ఒక ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యానికేతన్ ఒకటి. దీని కరస్పాండెంట్‌గానున్న వ్యక్తి చనిపోవడం నగరంలోనూ పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఇంత పేరున్న సంస్థ అధిపతి మృతి చెందడం అనుకోకుండా జరిగిందా.? లేక ఉద్దేశపూర్వకంగానే ఆయన ఆత్మహత్యకు యత్నించారా..? లేక ఎవరైనా ముందే హత్య చేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందా..? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యానికేతన్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ ఉమాపతి కారులో నుంచి సోమవారం ఉదయం దేవరకొండపై నుంచి కిందపడి మృతి చెందారు. ఈ ఘటన జరిగి సమయంలో అక్కడే ఉన్న కారు కింద పడుతున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. ఈ వీడియోలో చూసినప్పుడు ఆగిన కారు స్టార్టు అవకుండానే దూసుకెళ్లి కిందపడటం కనిపిస్తుంది. కిందపడే సమయంలో ఒక వ్యక్తి సార్...సార్ అంటూ వీడియో రికార్డు చేస్తూనే ఉన్నట్టు స్పష్టమవుతుంది. ఆ కారును ఆపే ప్రయత్నం చేసిన దాఖలాలు కూడా కనిపించక పోవడం గమనార్హం. కింద పడిన తరువాత ఉమాపతి కాలిన గాయాలతో చనిపోయి నట్టు కనిపిస్తుండటం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ఎందుకంటే కారుపై నుంచి కిందపడినప్పుడు కారులో ఎటువంటి మంటలు వ్యాపించ లేదు. పైగా పై నుంచి కిందపడిన సమయంలో గాయాలయితే రక్తగాయాలు కావాల్సి ఉంది. ఆయన శరీరంపై పెద్దగా గాయాలు కనిపించక పోవడం చూస్తే ముందే చనిపోయి ఉంటాడా అన్న సందే హాలు వ్యక్త మవు తున్నాయి. ఈ అను మానాలు సాధారణ వ్యక్తు లతో పాటు, ఆయన సన్నిహి తుల్లో కలుగుతున్న అనుమానాలు. కాని కుటుంబ సభ్యులు మాత్రం ఆయన ప్రమాదవశాత్తు చనిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మాత్రం ఇది ఆత్మహత్య అయ్యి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రాథమిక సాక్షాల ప్రకారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆయనే అంటించుకుని, శరీరంపై మంటలు వ్యాపించాక డ్రైవర్ పక్క సీట్లలో కూర్చోని హ్యాండ్ బ్రేక్ తీసివేయడంతో కారు కిందకు దూసుకుపోయిందని భావిస్తున్నారు. హత్య కుట్ర కనిపించడం లేదని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ వాదనలు ఇలాగుంటే ఆస్తి వ్యవహారాల్లో కొంత సమస్యలు కూడా ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు.

విద్యా సంస్థల అధినేత అయిన ఉమాపతికి అప్పులతోపాటు నగరంలో పలుచోట్ల ఆస్తులున్నాయి ఈ ఆస్తులను కొన్నింటినీ ఇటీవల అమ్మే ప్రయత్నం చేసినట్టు కూడా తెలుస్తోంది. అయితే కొన్ని ఆస్తుల విషయంలో రాజకీయ నాయకుల నుంచి సమస్యలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ తగాదాలు కొంతకాలంగా కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఉమాపతి మృతి పెద్ద చర్చనీయాంశంగా మారుతోంది. పోలీసు అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తే తప్ప అసలు వాస్తవాలు వెలుగులోకి రావన్న వాదనలు వినిపిస్తున్నాయి. అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తేనే అసలు విషయాలు బయటకు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విచారణకు రాజకీయపరమైన ఒత్తిళ్లు కొన్ని ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదంలో చనిపోయినట్టుగా చూపించాలని ఒత్తిడి పెంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు దీనిపై దర్యాప్తు ఏమి చేస్తారన్నది చూడాల్సి ఉంది.





కొండపై నుంచి పడి కారు(ఇన్‌సెట్‌లో మృతి చెందిన ఉమాపతి ఫైల్‌ఫొటో)



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పాఠశాలల్లో మెనూ తప్పనిసరి

◆ నిర్లక్ష్యం చేస్తే చర్యలు ◆ కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జగనన్న గోరుముద్ద కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనంలో తప్పకుండా మెనూ పాటించాలని నిర్వాహకులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం నాడు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమం కింద మద్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. మెనూ ప్రకారం భోజనాన్ని వండారా.? లేదా.? అన్న దానిని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచిచూసి సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నాణ్యతగా ఉండే ఆహారాన్ని విద్యార్థులకు అందించడం అత్యంత కీలకమన్నారు. అంతకుమునుపు లక్ష్మీచెన్నకేశవపురంలోని అంగన్వాడీ 12 కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కేంద్రాలకు ఎన్ని కోడిగుడ్లు వస్తున్నాయి.? స్టాక్ బ్యాలెన్స్ ఎంత ఉంది..? అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించార. ఈ పరిశీలనలో ఆయన వెంట జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షమ్మ, తహశీల్దార్ యుగేశ్వరదేవి, హెచ్ఎం శైలజ ఉన్నారు.

అమత్ సరోవర్ పనుల పరిశీలన

మండల పరిధిలోని పోతులనాగేపల్లి గ్రామం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ పథకంకింద జరుగుతున్న అమత్ సరోవర్ (నీటికుంట) పనులను మంగళవారం నాడు కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. రూ.20 లక్షల అంచనా మొత్తంతో జరుగుతున్న పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. ఉదయం త్వరగా వచ్చి ఎండ దెబ్బ తగలకుండా పనులు చేసుకోవాలన్నారు. పనిని కొలతల ప్రకారం కచ్చితంగా చేసినప్పుడే పూర్తి కూలి పడుతుందని కూలీలకు కలెక్టర్ తెలియజేశారు. కూలీలు అందరికీ పనులను కల్పించడంలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు వెంకటాచలపతి, శివశంకర్, ఎంపీడీవో మమతాదేవి, ఏపీవో అనిల్‌కుమార్, ఈసీ హరిబాబు, జేఈ నాగేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రకళ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ అరుణ, పంచాతీయతీ కార్యదర్శి మురళీ, ఫీల్డ్ అసిస్టెంట్ కంభం మురళీ, వైసిపి నాయకులు వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అనంతపురం ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి జిల్లాలోని గ్రామ,వార్డు మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విలేజ్ కానిస్టేబుల్, మహిళా పోలీస్ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎస్‌హెచ్ఒ, డీఎస్పీలకు గ్రామ విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో నేరాలు జరుగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పోలీసు అధికారులకు చేరవేసే బాధ్యత గ్రామ, వార్డు పోలీసు సిబ్బందిపై ఉందన్నారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు. మహిళా సమస్యలపై దృష్టి సారించడంతో పాటు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా వేయాలన్నారు. విధి నిర్వహణలో మంచి పనులు చేసే వారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఎస్‌హెచ్ఒలు ప్రతివారం మహిళా పోలీసులతో సమావేశమై గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో సమస్యలను గుర్తించి పోలీసు అధికారుల దష్టికి తీసుకురావాలన్నారు. మహిళా వ్యవస్థ ఏర్పాటయ్యాక గణనీయమైన ఫలితాలు వస్తున్నాయని, వీటిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేలా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన మెళకువలు, సూచనలు, సైబర్ నేరాలకు గురైన సందర్భంలో ఎలా ముందుకెళ్లి పరిష్కారం చేసుకోవచ్చు, చిన్నారులపై జరిగే లైంగిక దాడులు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి వివరిస్తూ లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, తాడిపత్రి డీఎస్పీ చైతన్య, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్‌తో పాటు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు జరగాలి

బుక్కపట్నం : ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారమే రిజిస్ట్రేషన్లు జరగాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి మాధవి తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఇటీవల రిజిస్టర్ అయిన స్థలాలను, ఇళ్లను పరిశీలించి రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం జరిగాయా లేదా అని ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రయ విక్రయదారులు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ శ్రీనివాస్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రఘువీరా..!



నాయకుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

రాజకీయ అనిశ్చితికి తెర పడినట్టేనా..?

ప్రజాశక్తి - మడకశిర

కర్నాటక రాష్ట్రంలో జరగబోవు ఎన్నికలతో తన రాజకీయ అనిశ్చితికి తెరదించి అక్కడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న రఘువీరారెడ్డి మంగళవారం పట్టణంలోని శ్రీ నీలకంఠా శీతల గిండంగి ఆవరణంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి తన అజ్ఞాత రాజకీయానికి తెరదించుతున్నాని తెలిపారు. హస్తిన పార్టీ పెద్దల ఆదేశం తోనే తిరిగి తాను రాజకీయ అరంగేట్రానికి పునుకున్నానని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నెలకొన్న రాజకీయ ప్రకంపనలతో దేశ పురోగతి తిరోగమన దిశలో పయనిస్తుండం తనను ఎంతో కలచి వేసిందన్నారు. అంతే కాకుండా కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర , రాష్ట్రేతర ప్రాంతాల్లో బలోపేతం చేయడంలో కీలకపాత్ర తీసు కోవాలని పార్టీ పెద్దల సూచనలతో ప్రత్యక్ష రాజీయాల్లో చురుకుగా పాల్గొనాలనుకున్నానని చెప్పారు.ఈ నేపథ్యంలోనే కర్నాటక రాజధాని బెంగళూరు సిటీ పరిధిలో ఉంటున్న 13 నియోజకవర్గాల పరిధిలోని అభ్యర్థుల గెలుపు తన భుజస్కంధాలపై అధిష్టానం ఉంచిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రఘువీరారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేవలంకాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. నేటి నుండే కర్నాటకలో పాగా వేసి అక్కడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

పెనుకొండను భారతవారసత్వ నగరంగా ప్రకటించాలి

పురావస్తు చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండను భారతవారసత్వ నగరంగా ప్రకటించాలని చరిత్రకారుడు మైనాస్వామి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలువురు పురప్రముఖులతో కలిసి ఆయన పట్టణంలోని పెనుకొండ కోట, చారిత్రక కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా మైనాస్వామి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండను సుందర వారసత్వ నగరంగా అభివృద్ధి చేయడానికి కనీసం 300 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. రెండువేల సంవత్సరాల చరిత్ర కలిగిన నగరం పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధిలో వెనుకబడివుండడం శోచనీయమని అన్నారు. ప్రాచీనమైన, పటిష్టమైన, అత్యంత పొడవైన కోటలు ఆంధ్రప్రదేశ్‌లో మూడు మాత్రమే ఉన్నాయన్నారు. మొదటిది కొండవీడు(గుంటూరు జిల్లా) కాగా, రెండవది పెనుకొండ, మూడవది చంద్రగిరి(తిరుపతి జిల్లా). అని చెప్పారు. అయితే పెనుకొండ మినహా మిగిలిన చోట్ల ఎక్కువ కట్టడాలు లేవన్నారు. ఏడు ప్రాకారాల కోటలు, అద్భుత శిల్పకళా నిలయాలైన హిందూ, జైన ఆలయాలు, సుందర పుష్కరిణులు, మెట్ల బావులు, రాజ భవనాలు ఇక్కడ ఉన్నాయన్నారు. పార్శ్వనాథ, అజితనాథ జైన తీర్థంకరుల గుడులు, రామభద్ర, కాశీ విశ్వేశ్వర సన్నిధులు అరుదైన శిల్పశోభతో అలరారుతున్నాయని చెప్పారు. వందల సంఖ్యలో శాసనాలున్నాయని వాటిలో పదులసంఖ్యలో పాడయ్యాయని అన్నారు. పెనుకొండను వారసత్వ నగరంగా ప్రకటించడానికి అన్ని అర్హతలున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఒక యథాస్థితి నివేదికను రూపొందించడం ద్వారా అభివృద్ధి పనులు అమలు చేయాలని కోరారు. గగనమహల్ వద్ద నుంచి పెద్దకొండకు తీగ మార్గం(రోప్ వే), పెనుకొండ చరిత్రను వివరించే లేజర్ షో, థీం పార్క్, అంతర్జాతీయస్థాయి పురావస్తు ప్రదర్శనశాల, కళ–సాంస్కృతిక వేదిక, అందమైన ఉద్యాన వనాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. భారత పర్యాటక పటంలో పెనుకొండను సమున్నత స్థాయిలో నిలపాలని కేంద్ర పర్యాటక శాఖకు విన్నవిస్తున్నామన్నారు. పుర ప్రముఖులు,చరిత్రకారులు ఢిల్లీ వెళ్ళి మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పి అధ్యక్షులు వేదవ్యాస్, రామకృష్ణ, సుధాకర్ గుప్తా, నాగరాజు, త్రినాధ్, యతి తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన పురాతన కట్టడాన్ని చూపుతున్న మైనాస్వామి, తదితరులు

పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలు తయారు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చేనేత రకాలను పవర్ లూమ్స్ లో తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజీ హెచ్చరించారు. ఈ మేరకు వారు పట్టణంలో మంగళవారం దాడులు నిర్వహించి పవర్ లూమ్స్ మగ్గంలో చేనేత ఉత్పత్తులను తయారు చేస్తున్న వాటిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో చింతా ఆనంద్ పవర్‌లూమ్స్‌లో చేనేత రకాలను తయారు చేస్తున్నారని అందుకే అతనిపై కేసు నమోదు చేశామని అన్నారు. పవర్ లూమ్స్‌లో 45 శాతం రేషం ఉపయోగించవచ్చన్నారు. 45శాతం రేషం దాటితే చేనేత రకాలను ఉల్లంఘించినట్లేనని తెలిపారు. ఇక నుంచి తరచూ దాడులు నిర్వహిస్తామని చెప్పారు. గత పది నెలల్లో 5 కేసులు నమోదు చేశామన్నారు. పవర్‌లూమ్స్ లో 11 రకాల చేనేత ఉత్పత్తులను తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చేనేత రకాలను కాపాడేందుకు, పట్టు పరిశ్రమను రక్షించేందుకు ప్రతిరోజు దాడులు నిర్వహించి పవర్ లూమ్స్‌లో చేనేత రకాలు తయారు చేయకుండా దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వరరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగసాయి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ లూమ్స్‌లో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అప్పులబాధతో విఆర్ఒ ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకన్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం మోపార్లపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు... మొపర్లపల్లి గ్రామానికి చెందిన రమేష్(35) రొద్దం మండలం కంబాలపల్లి సచివాలయంలో విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గ్రామం బయట ఉన్న పొలంలో నివాసం ఏర్పాటు చేసకుని అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం ఈయన రూ.5లక్షల వరకు ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చడం కష్టం కావడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తరువాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విఆర్ఒ ఆత్మహత్య విషయం తెలుసుకున్న తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్‌లు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కంబాలపల్లి పంచాయతీ సర్పంచి మంజు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు.



రమేష్ (ఫైల్ ఫొటో)

స్వచ్ఛంద సంస్థ ముసుగులో పేదల భూములు ఆక్రమణ

వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

స్వచ్ఛంద సేవా సంస్థ ముసుగులో పేదల భూములు ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని వారి ఆటలు సాగనివ్వమని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టింబక్టు కలెక్టివ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సత్యసాయి జిల్లా రొద్దం మండలం కోగిర, కంబాలపల్లి, శ్యాపురం గ్రామాల దళిత, గిరిజనుల సాగు భూములను ఆక్రమించడానికి దాడులకు దిగుతున్నారన్నారు. కోగిర రెవిన్యూ గ్రామ పొలం సర్వే నంబర్లు 666, 669 లో సుమారు 4500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. పై మూడు గ్రామాలకు చెందిన 2వందల మంది వ్యవసాయ కూలీల కుటుంబాలు గత 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాయన్నారు. వారి సాగు మేరకు సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని పలుమార్లు విన్నవించుకున్నారన్నారు. అప్పట్లో అధికారులు కొంతమేరకు రికార్డు పని చేశారన్నారు. 2014 నుంచి 2018 వరకు వరస కరువులతో బతుకుతెరువు కోసం వలసలు వెళ్లారన్నారు. కరోనా కారణంగా 2020లో స్వంత గ్రామాలకు చేరుకున్నారన్నారు. వర్షాలు బాగా కురుస్తున్నందున సాగు చేయడానికి భూమిలోకి వెళ్లగా ఆ స్వచ్ఛంద సంస్థకు సాగు భూములు కేటాయించారని తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ పేద దళిత గిరిజనులపై దాడులు చేస్తున్నారన్నారు. పోలీసులతో బెదిరిస్తున్నారన్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన స్వచ్ఛంద సంస్థే దాడులకు పూనుకోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని కోరారు. పేదలకు భూములు దక్కేవరకు తాము పోరాడుతామన్నారు.

యువగళం పాదయాత్ర విజయవంతంపై హర్షం

రామగిరి: నారాలోకేష్ ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్ర విజయంతంపై మాజీ మంత్రి పరిటాల సునీత హర్సం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 28రోజులపాటు నిర్వహించిన యువగళం పాదయాత్రను విజయం విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మహిళలకు, యువతకు, మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టినమూనాల సేకరణపై శిక్షణ

రామగిరి : మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ విధానం గురించి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఎంపిఇఒ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

బత్తలపల్లి : దృష్టి లోపంతో బాధపడుతున్న 105 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను వైద్యాధికారులు అందజేశారు. మంగళవారం మండలంలోని సంజీవపురం కేజీబీవీ పాఠశాలలో సర్పంచు కమతం వరలక్ష్మీ చేతులు మీదుగా 16 మంది విద్యార్థినులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఒ నాగరత్నబాయ్, మధురిమ, శ్రీలత, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎండలు పెరిగేలోపు పనులు ముగించుకోండి

బత్తలపల్లి : ఈ ఏడాది వేసవిలో ఎండలు మండుతున్నాయని, ఎండలు పెరిగేలోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఒ శ్రీదేవి ఉపాధి కూలీలకు సూచించారు. మంగళవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలోని చెరువులో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను ఏపీవోతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ కూలీలకు వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ వేసవి నుంచి రూ 257లు ఉన్న వేతనం రూ.272కు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈ నాగార్జున, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి, కమతం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగల్‌విండో అధ్యక్షురాలిగా సుశీలమ్మ

నంబుల పూలకుంట : ఎన్పీకుంట సింగిల్ విండో అధ్యక్షురాలిగా ముసల్‌రెడ్డి గారి సుశీలమ్మ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు డైరెక్టర్లుగా ఎదురుదోన గ్రామానికి చెందిన ఆదెప్పనాయుడు, మరికొమ్మదిన్నెకు చెందిన ఇమాంసాబ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం తరపున రైతులకు న్యాయం చేస్తామన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పి.వి.సిద్దారెడ్డికి, ఎంపీపీ ఈటె రాముకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో నియామక పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈటెరాము, వైస్ ఎంపిపి కేశవరెడ్డి, పారిశ్రామిక వేత్త హరీష్ రెడ్డి, ఎంపిటిసిలు సరస్వతి, తిమ్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సుబహాన్, సర్పంచి విష్ణుమూర్తి, జేసిఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, నాయకులు నారాయణస్వామి, మాధవరెడ్డి, కలాం, పుల్లారెడ్డి, మాజీ ఎంపిపి సోమిరెడ్డి, కేశవ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

దళితుల నమ్మకద్రోహి వైఎస్.జగన్ : టిడిపి

బుక్కపట్నం : దళితుల నమ్మకద్రోహి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని టిడిపి తోనే దళితులు అభివద్ధి సాధ్యం అవుతుందని పుట్టపర్తి ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ యశోద అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ దళితుల గురించి మాట్లాడిన మాటలను వక్రీకరించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళితులను మూడు ముక్కలు చేసి, మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయకుండా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. టిడిపి ప్రభుత్వంలో దళితులకు కోసం ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. గత నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో దళితులపై దాడులు పెరిగాయని టిడిపి ప్రభుత్వ హయాంలోనే దళితులకు అన్ని విధాల లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఇప్పటికైనా దళితులను వక్రీకరించకుండా మాట్లాడాలని ఆమె సూచించారు.

రాతిదూలం లాగుడు పోటీలు

రొద్దం : మండలంలోని తురకలపట్నం గ్రామంలో రాతి దూలం లాగుడు పోటీలను మంగళవారం నిర్వహించారు. మండలంలోని ఎల్జిబి నగర్ లో ఉన్న బైలాంజనేయ స్వామి ఆలయ ప్రారంభం అని 41రోజులు అయిన సందర్భంగా మంగళవారం ఎద్దులతో రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

కదిరి టౌన్ : కదిరి ఎంపిపి అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం కదిరి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

లేపాక్షి : మండలంలో కల్లూరు, కొండూరు గ్రామాలలో రబీ సీజన్ 2022-2023 లో వేసిన రాగి పంట కోత ప్రయోగాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎవిఎ అల్తాఫ్ అలీ ఖాన్, మండల వ్యవసాయ అధికారి శ్రీ లత,కల్లూరు సర్పంచ్ వసుంధరమ్మ, వైస్ ఎంపీపీ లీలావతమ్మ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రొద్దం : మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

గోరంట్ల : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 30 ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్లో ఈనెల 19న బహిరంగ వేలం వేయనున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు డిపాజిట్ దారులు 3వేల రూపాయల డిపాజిట్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు.

సచివాలయం తనిఖీ

లేపాక్షి : మండల కేంద్రం లోని సచివాలయం 1ను డిపిఒ తనిఖీ చేశారు. 9మంది సిబ్బందికి కేవలం ఇద్దరు మాత్రం రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండల కేంద్రం లోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, సిబ్బంది విజయ్, తిరుమలేష్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభేరి కరపత్రాలు విడుదల

రొద్దం : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలపై ఈ నెల 14నుండి 30వరకు ప్రచార భేరి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రచారభేరికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులపై అంకితభావం అవసరం : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అందుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. రీ సర్వే, గృహ నిర్మాణం, ఇంటి పట్టాల పంపిణీ, జాతీయ రహదారులకు భూ సేకరణ, స్పందన, ఉపాధి హామీ, వ్యవసాయ అనుబంధ శాఖలు ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు తదితర అంశాలపై సమీక్షించారు. రీ సర్వేలో స్టోన్ ప్లాంటేషన్ గురువారం నాటికి పూర్తి కావాలన్నారు. అలాగే పెగ్ మార్కింగ్ పక్రియ 27వ తేదీ నాటికి పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 7 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ ఈనెల 19న విడుదల చేయాలని చెప్పారు. ప్రణాళిక ప్రకారం రీ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులకు భూసేకరణ పక్రియ సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణానికి సంబంధించి ఇంకా మొదలు పెట్టని 10,190 ఇళ్ల నిర్మాణాల విషయంలో వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. ఈనెల 23 లోగా అన్ని ఇల్లు బిబిఎల్ లోకి రావాలన్నారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేసే పక్రియ పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచి 100 రోజుల పని కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ కి సంబంధించి రైతులకు ఈకేవైసీ పక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కొండయ్య, సిపిఒ విజయ్ కుమార్, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిడిఒ విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి : వ్యకాసం

ప్రజాశక్తి -పెనుకొండ

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అడదాకులపల్లి,మావటూరు గ్రామాలలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి పథకం అమలు తీరును వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంత పని చేసిన కూలి గిట్టుబాటు కావడం లేదని , ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. చేసిన పనికి సకాలంలో బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వేసవి అలవెన్స్, పనిముట్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వమే ఉద్దేశ్య పూర్వకంగా కూలీలను పథకానికి దూరం చేయడానికి పూనుకుందని విమర్శించారు. అందులో భాగంగానే బడ్జెట్ లో కోతలు పెడుతోందని విమర్శించారు. కూలీలు ఐక్యంగా సంఘటితంగా పోరాడినప్పుడే ఉపాధి పథకం రక్షింప పడుతుందని తెలిపారు. రాబోయే కాలంలో సంఘం పిలుపులో పాల్గొనాలని నాయకులు ఉపాధి కార్మికులకు పిలుపునిచ్చారు.

ఎంబిఎ విద్యార్థికి చేయూత

తలుపుల : మండల కేంద్రంలోని రాడ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గాండ్లపెంట మండలం నాయనవారి పల్లికి చెందిన బిసి విద్యార్థి బి రెడ్డప్పకు చేయూతను అందించారు. రెడ్డప్ప అనంతపురం ఎస్కే యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్నాడు. పై చదువులకు ఫీజు కొరకు రాడ్స్ సంస్థ మేనేజర్ బావ ఫక్రుద్దీన్ చేతుల మీదుగా విద్యార్థికి 10వేల రూపాయలను అందజేశారు విద్యార్థి కుటుంబం సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మేనేజర్ బాబా ఫక్రుద్దీన్ కోఆర్డినేటర్ కళ్యాణి, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాలపై కార్మికులకు అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం


పరిశ్రమల్లో సంభవించే అగ్ని ప్రమాదాలపై కార్మికులకు అగ్నిమాపక అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం లేపాక్షి సమీపంలో ఉన్నా సర్‌డెనీమ్ ప్రవేట్ లిమిటెడ్ పరిశ్రమలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై వివరిస్తూ అగ్ని నిరోధక పరికరాల గురించి వివరించారు. పరిశ్రమలో పెద్ద ప్రమాదాలు సంభవిస్తే మోటార్లు, ఇతర ఫైర్ ఎక్యుప్‌మెంట్ సహాయంతో మంటలు ఏవిదంగా ఆర్పవచ్చో వివరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సురక్షితంగా బయటకు వెళ్ల విధానాలు తనతోటి వారు గాయపడినప్పుడు వారిని ఏవిదంగా బయటికు తీసుకెల్లే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, కార్మికులు, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు





అభివృద్ధి పథకాల బ్రోచర్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని జీవీ పాళ్యంగ్రామ సచివాలయం పరిధిలోని మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి సిఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి బత్తలపల్లి మండలంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు తెలిపారు. బత్తలపల్లిలోని స్టేట్ బ్యాంకు వెనుకున్న కాలనీ, టీచర్స్ కాలనీలో మంగళవారం ఆయన ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలను తెలుసుకుని, గోడలపై స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంటర్ కరీంసాబ్, సాకే గోపాల్, వడ్డె ప్రసాద్, పరశురాంబాబులతో పాటు గృహసారథులు, వాలెంటీర్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రతి ఇంటికి లబ్ది చేకూరుతోందని ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ లోని 8,9 వార్డు పరిధిలోని ఉప్పరవాడ, దర్గాపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు రోడ్లు,డ్రైనేజీ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్, జయ శంకర్ రెడ్డి, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహ, ఎంపీడీవో శివశంకరప్ప, కమిషనర్ వంశీకృష్ణ, భార్గవ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, నగర పంచాయతీ అధికారులు,సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పై అనవసర విమర్శలు తగదు : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాజకీయ పార్టీలపై విమర్శలు చేసుకోవచ్చుకానీ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడకూడదని తమ అధినేత పవన్ కల్యాణ్ ఒకటి చెప్పితే దానికి మంత్రి పేర్ని నాని వక్రీకరించి మాట్లాడటం తగదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను. ప్రాంతాలను తక్కువ చేసి మాట్లాడకూడదని చెప్పడం తప్పేమిటన్నారు. గతంలో తెలంగాణా మంత్రులు ఆంధ్రా ప్రజలను తక్కువ చేసి మాట్లాడినప్పుడు పవన్ కల్యాణ్ ఇదే సమాధానం చెప్పారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్ బాబాయ్‌ను చంపిన కేసులో వాళ్ళ కుటుంబసభ్యులే ముద్దాయిలై అరెస్టులవుతున్నారన్నారు. జగన్ దేశంలోనే దోపిడి, కబ్జాలలో నెంబర్‌వన్ ముఖ్యమంత్రి అని విమర్శించారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికిస్తున్నారని. ఏ ఘన కార్యం సాధించారని ఈ స్టిక్కర్లను అతికిస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రత్యేక హోదా సాదిస్తామని గొప్పలు చెప్పి వాటిపై పార్లమెంట్ నిలదీయలేక పోవటం వైసిపి చేతగాని తనమే అని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చిలకం



టిడిపి జోన్ -5 సమావేశంలో ధర్మవరం నాయకులు

జోన్-5 సమీక్ష సమావేశానికి హాజరైన ధర్మవరం నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కడపలో మంగళవారం జరిగిన టీడీపీ జోన్-5 సమీక్షా సమావేశానికి ధర్మవరం టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హాజరై రాబోవు ఎన్నికలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గెలుపు కోసం అహర్నిశలు పనిచేయాలని సూచించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై వివరించినట్లు ధర్మవరం టీడీపీ నాయకులు చెప్పారు. ఈ సమావేశంలో ధర్మవరం టిడిపి నాయకులు కమతం కాటమయ్య. పురుషోత్తంగౌడ్, పరిశే సుధాకర్, అంబటిసనత్, బోయరవిచంద్ర, చింతపులుసు పెద్దన్న, గరుగువెంగప్ప, క్లస్టర్ రామాంజి, అనిల్, సురేష్‌నాయుడు. దుర్గాప్రసాద్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టింబర్ డిపో దగ్ధం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గమ్మగుడి సమీపంలో ఉన్న టింబర్ డిపో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైంది. బాదితుడు అబ్దుల్ తెలిపిన వివరాలు... దుర్గమ్మగుడి సమీపంలో అబ్దుల్ అనే వ్యక్తి టింబర్ డిపో ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం టింబర్ డిపోలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో డిపోలోని తలుపులు, కిటికీలు, కట్టెలు, విద్యుత్మీటర్ తదితర సామాగ్రి కూలిబూడిదయ్యాయి. దీంతో తనకు రూ.50వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాదితుడు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

సోమందేపల్లి : మండల కేంద్రంలోని వినాయక్ నగర్‌లో అద్దె ఇంటిలో నివాసముంటు హమాలీ పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్న గోపాల్ (25) అనే దళిత యువకుడు మంగళవారం సాయంత్రం తన నివసిస్తున్న నివాసంలో ఉరి వేసుకుని మృతిచెందాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో అతని భార్య మాధవి చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి. గోపాల్ ఆత్మహత్య గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సుంది.

సకాలంలో విధులకు హాజరుకావాలి

పుట్టపర్తి రూరల్: సచివాలయాలకు సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని దిగవ చెర్లోపల్లి ,పెడపల్లి సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ప్రజలకు అందించే సేవలను సకాలంలో అందించాలని, వారిపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. కార్యాలయాలకు తప్పనిసరిగా యూనిఫారం వేసుకుని రావాలని అలా రాని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెడపల్లి సర్పంచి మంగ్లీ బాయ్, పంచాయతీ కార్యదర్శి అశ్విని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామ సమీపంలోని చిత్రావతి నది నుండి బత్తలపల్లి చెరువుకు నీరు అందించే సప్లై ఛానల్ పనులను నిర్వహిస్తుండగా ఆయన క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పనులు సక్రమంగా నిర్వహించాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా పనులు చేపట్టేటప్పుడు కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మధుసూదన్ రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న అధికారులు

అర్హులందరికీ పక్కాగృహాలు

కదిరి టౌన్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే సిద్దా రెడ్డి పేర్కొన్నారు. కదిరి ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపిపిలు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, హౌసింగ్ డిఇ. ఎఇలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొదట ప్రాధాన్యతగా జగనన్న హౌసింగ్ కాలనీలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఇప్పటివరకు మంజూరైన 5 వేలకు పైగా ఇంటి నిర్మాణాలను తక్షణమే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సప్తగిరిలో ప్రాంగణ నియామకాలు

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి కళాశాలలో మంగళవారం ఆల్‌సెక్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో సంస్థ ప్రతినిధులు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న 11 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతు తమ కళాశాలలో విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ కల్పనకు అవసరమైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందువల్లే విద్యార్థులు ఏ కంపెనీ జాబ్ మేళా నిర్వహించిన కళాశాల విద్యార్థులు ఎక్కువ మంది ఎంపిక అవుతున్నారన్నారు. ఇదే విధంగానే మరిన్ని కంపెనీలతో జాబ్ మేళా కార్యక్రమాన్ని చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, ఎంబిఎ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజూనాథ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

జిల్లా కేంద్రంలో వెలగని వీధిదీపాలు

పుట్టపర్తి అర్బన్ : జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లోని గోకులం ప్రధాన రహదారిలో గత నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. ఇక్కడే కలెక్టర్ కార్యాలయం ఉంది. ఆర్టీసీ డిపో ఉంది. ప్రధాన రహదారి పైనే వీధి దీపాలు వెలగనందున అంధకారంలోనే గోకులం వాసులు గడపాల్సి వస్తోంది. కలెక్టర్ కార్యాలయం ఉన్న ప్రధాన రహదారిలోనే వీధిదీపాలు వెలగకపోవడం పట్ల సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని గోకులం వాసులు విమర్శిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై నిరసన

పుట్టపర్తి రూరల్: ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్,గ్రామ వార్డు సచివాలయ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల కేంద్రాల్లో ఉన్న ఉద్యోగులకు హెచ్‌ఆర్ఎ పెంచాలని పెండింగ్లో వున్న డిఎలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. రిటైర్డ్‌ఉద్యోగులకు వెంటనే బకాయిలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రములో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ మైనుద్దీన్, పద్మనాభ రావు, మధునాయక్, జాయింట్ సెక్రటరీ నరసింహులు, మునిసిపల్ అసోషియేషన్ ప్రెసిడెంట్ నరసింహులు,శ్రీ సత్య సాయి జిల్లా ఆర్‌టిసి డిపో అధ్యక్షులు నాగార్జున రెడ్డి, ఆదినారాయణ, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.




నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని సౌకర్యాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆ పాఠశాలలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్టర్ నందిత, పాఠశాల సెక్రెటరీ నందకుమార్, ప్రముఖ వైద్యులు సొదీన్ రెడ్డి, చందనా దీప్తి, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి చేతుల మీదుగా మార్కుల మెమోతో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్టర్ నందిత మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయికి అనుగుణంగా ప్రమాణాలను ఏర్పాటు చేసి ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దీనికోసం బెంగళూరులో అంతర్జాతీయ గుర్తింపు పొందిన వివిధ పాఠశాలలను పరిశీలన చేసి ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాల కన్నా మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తామన్నారు. విద్యకు పునాది ప్రాథమిక విద్య అని, ప్రాథమిక విదదశలో క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడంతో విద్యార్థి ఉన్నత విద్యకు వెళ్లే సమయానికి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, అబ్దుల్ రజాక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్న పాంచజన్య శ్రీనివాసులు